సాక్షి
శ్రీకాకుళం
ఆదివారం । 13 । ఏప్రిల్ । 2025



పాడి పరవళ్లు..!

కొత్త కొత్తూరు గ్రామం స్వచ్ఛమైన పాలకు చిరునామాగా నిలుస్తోంది. 90 శాతం కుటుంబాలు పాడి సంపదపైనే ఆధారపడుతున్నారు. - 8లో



రేపటి ఎస్పీ గ్రీవెన్స్ రద్దు

శ్రీకాకుళం క్రైమ్ : డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జయంతి పురస్కరించుకుని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ (గ్రీవెన్స్) రద్దు చేస్తున్నట్లు ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి తెలిపారు.

వైఎస్సార్ సీపీ పీఏసీ మెంబర్‌గా తమ్మినేని



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీని పూర్తిస్థాయిలో పునర్ వ్యవస్థీకరించి పీఏసీ మెంబర్లుగా 33 మందిని నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. అందులో మొదటి పేరు మాజీ శాసన సభాపతి తమ్మినేని సీతారాం పేరు ఉండటం పట్ల పార్టీశ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.

న్యూస్‌రీల్

15 నుంచి సముద్రంలో వేట నిషేధం

అరసవల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాల ప్రకారం సముద్ర జలాల్లో ఈ నెల 14వ తేదీ అర్ధరాత్రి నుంచి చేపల వేట నిషేధం అమల్లోకి రానుందని, జూన్ 14 అర్ధరాత్రి 12 గంటల వరకు నిషేధాంక్షలు అమల్లో ఉంటాయని జిల్లా మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ సత్యనారాయణ శనివారం ప్రకటించారు. నిషేధ కాలంలో వేటకు వెళ్లడం నేరంగా పరిగణిస్తారని, మత్స్యకారులు ఈ నిబంధనలను పాటించాలని కోరారు. కోస్టల్ ప్రాంతాల్లో గస్తీ కూడా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

పవర్ ప్లాంట్ చిమ్నీ కూల్చివేత



కూలిపోతున్న పవర్ ప్లాంట్ చిమ్నీ

సంతబొమ్మాళి: మండలంలోని కాకరాపల్లి తంపరలో ఈస్ట్‌కోస్ట్ థర్మల్ ప్లాంట్ యాజమాన్యం నిర్మించిన 173 మీటర్ల ఎత్తయిన చిమ్నీ (పొగగొట్టం)ను బాంబులు పెట్టి శనివారం సాయంత్రం కూల్చివేశారు. 2009-2011 మధ్య ఈ చిమ్నీ నిర్మాణం చేపట్టారు. 2011 ఫిబ్రవరి 28న ఉద్యమకారులపై పోలీసు కాల్పులు జరపడం, ముగ్గురు చనిపోవడంతో పవర్ ప్లాంట్ నిర్మాణాలకు బ్రేక్ పడింది. ఎట్టకేలకు 14 ఏళ్ల తర్వాత సంబంధిత లీజుదారు చిమ్నీని కూల్చివేశారు. దీని కోసం కలెక్టర్, ఎస్పీ నుంచి అనుమతి తీసుకొని ఎక్స్‌ప్లోజివ్ యాక్ట్ ప్రకారం క్లోజ్ ద్వారా కంట్రోల్ బ్లాస్టింగ్ చేయించారని డీటీ హరి తెలిపారు.

తలుపులు లేని ఆలయం

నిరంతర దర్శనం





అమ్మవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు (ఇన్‌సెట్లో) కొలువైన ధనరాజుల తులసమ్మ

ఇచ్ఛాపురం రూరల్: అతి ప్రాచీన, చారిత్రక ఆలయాలకు కొలువైన సిక్కోలు జిల్లాలో ఒక్కో దేవాలయం ఒక్కో ప్రత్యేకతను కలిగి ఉంటుంది. భక్తుల విశ్వాసాలు, స్థానిక ఆచార సంప్రదాయాలతో ముడిపడి దశాబ్దాలుగా పూజలందుకుంటూ ఆ ప్రాంతానికే ప్రత్యేకంగా నిలుస్తుంటాయి. ఆ కోవకు చెందినదే ఇచ్ఛాపురం మండలం లొద్దపుట్టి గ్రామంలోని 'ధనరాజుల తులసమ్మ' ఆలయం. ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవంగా, భక్తుల కొంగు బంగారంగా, వరాలిచ్చే అమ్మవారిగా పిలవబడే ఈ ఆలయం అనేక ప్రత్యేకతలు కలిగి ఉంది. తలుపులు లేకపోవడంతో పాటు 24 గంటలు, 365 రోజులు భక్తులు దర్శించుకునే అవకాశం ఉంటుంది. అనునిత్యం అమ్మవారు ప్రజల్ని కనిపెట్టుకుని ఉంటారని, అందుకే ఇక్కడ ఎలాంటి తలుపులు, తాళాలు ఉండవని భక్తుల విశ్వాసం. ఆంధ్రా ఒడిశా ప్రాంతాలకు వెళ్లే సరిహద్దు ఇచ్ఛాపురం - బరంపురం - ఒడిశా జరడా మూడు రోడ్ల కూడలిలో బాహుదా నదికి సమీపంలో అమ్మవారు నిత్య పూజలు అందుకుంటున్నారు.

- ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవంగా ధనరాజుల తులసమ్మ
- ఇచ్ఛాపురం సరిహద్దులో రోజంతా భక్తులకు దర్శనం
- నేడు వైభవంగా జరగనున్న వార్షికోత్సవ సంబరం
- తరలిరానున్న వేలాది మంది భక్తులు

నమ్మకం

కోర్కెలు తీర్చే కొంగు బంగారం..

ఒకప్పుడు కొచ్చెర్ల వంశీయులు మాత్రమే అక్కడ పూజలు చేసేవారు. రానురాను గ్రామస్తులు సైతం పూజలు చేయడం ప్రారంభించడంతో పాటు చిన్నపాటి ఉత్సవాలు నిర్వహించేవారు. జాతీయ రహదారికి ఆనుకొని ఉండటంతో అటు వైపుగా రాకపోకలు సాగించే లారీ, బస్సు డ్రైవర్లు కొబ్బరి కాయలు కొట్టి పసుపు, కుంకుమ బొట్టును తమ వాహనాలకు పెట్టేవారు. ఇలా మొదలైన పూజలు సంబరాలుగా మారిపోయాయి. ఆంధ్రాతో పాటు ఒడిశా భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి బారులు తీరుతున్నారు. ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవంగా కొలుస్తూ భక్తులు లక్షల రూపాయలు ఖర్చు పెడుతూ సంబరాలు నిర్వహిస్తున్నారు.

వందేళ్లనాటి చరిత్ర..

పూర్వీకులు, స్థానికుల కథనం మేరకు.. సుమారు వందేళ్ల క్రితం లొద్దపుట్టి గ్రామానికి చెందిన కొచ్చెర్ల పాట్టెమ్మ గారాలపట్టి తులసమ్మ ఐదేళ్ల బాల్యంలోనే మృతి చెందింది. ఓ రోజు తన తల్లి కలలో కనిపించిన తులసమ్మ 'తన జ్ఞాపకార్థం బాహుదా నదికి ఆమడ దూరంలో మూడు రోడ్ల కూడలిలో ఉన్న మూడు మర్రి చెట్లు చెంత ప్రతిష్ఠించండి' అని కోరింది. మరునాడు బంధువులు మేళతాళాలు నడుమ చిన్న రాయిని పసుపు, కుంకుమలతో మర్రి చెట్ల వద్ద ప్రతిష్ఠించారు. ఇదిలా ఉండగా.. లొద్దపుట్టి గ్రామ దైవంగా పిలిచే 'ధనరాజు'కు గ్రామస్తులు బాహుదానది చెంతనున్న పీర్ల కొండపై పూజలు నిర్వహిస్తుండేవారు. లొద్దపుట్టి గ్రామానికి, పీర్ల కొండకు సుమారు రెండున్నర కిలోమీటర్ల దూరం కావడంతో అప్పటి గ్రామ పెద్దలు నిర్ణయంతో 'ధనరాజు'గా పూజలందుకుంటున్న 'రాయి'ని తెచ్చి మూడు మర్రి చెట్లు దిగువనున్న తులసమ్మ చెంత ప్రతిష్ఠించారు. నాటి నుంచి గ్రామస్తులు 'ధనరాజుల తులసమ్మ'గా నామకరణం చేసి పూజలు చేయడం ప్రారంభించారు. పక్కనే ఉన్న శనివారం సంతకు వచ్చే వ్యాపారులు, బాటసారులు ఈ మర్రి చెట్లు నీడనే అలసట తీర్చుకొని వంటలు చేసుకొని భోజనాలు చేసేవారు.



తలుపులు లేని తులసమ్మ అమ్మవారి ఆలయం



ఉత్సవానికి ఏర్పాట్లు

అంబరాన్నంటే సంబరం..

ఆలయానికి వచ్చే కానుకలతో ఏటా ఏప్రిల్ రెండో ఆదివారం భారీ ఎత్తున సంబరం చేస్తుంటారు. ఆంధ్రా, ఒడిశాతో పాటు కోల్‌కతా, భువనేశ్వర్, విశాఖపట్నం, హైదరాబాద్ వంటి ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి ఉత్సవంలో పాల్గొంటూ బోనాలు సమర్పిస్తుంటారు. ఉదయం నుంచి రాత్రి వరకు నిర్వహించే ఈ సంబరం అంబరాన్ని తాకుతుంది.

ఎవరైనా రావొచ్చు..



పూజార్లు ఉంటున్నా ఇక్కడ మంత్రాలు, ప్రత్యేక హోమాలు, పూజలు అంటూ ఏమీ జరగవు. ఎవరైనా అమ్మవారి దగ్గరకు వచ్చి పూజ చేసుకోవచ్చు. ప్రతి ఆది, మంగళవారం భక్తులు సంబరాలు నిర్వహిస్తుంటారు. భక్తులకు అసౌకర్యం లేకుండా గ్రామస్తులు ఏర్పాట్లు చేస్తుంటారు.

– కొచ్చెర్ల పేరయ్య, ఆలయ ప్రధాన పూజారి


భక్తులతో కళకళ..



తులసమ్మను మనసులో స్మరించుకొని బలంగా కోరుకుంటే ఆ కోరిక నెరవేరాల్సిందే. కరోనా సమయంలో సైతం ప్రపంచ వ్యాప్తంగా అన్ని ఆలయాలు మూతబడినా.. తులసమ్మ ఆలయం మాత్రం భక్తులతో కళకళలాడేది. ప్రతీ ఏడాది ఏప్రిల్ రెండో ఆదివారం పెద్ద ఎత్తున ఉత్సవాన్ని నిర్వహిస్తుంటాం.

– దక్కత చంద్రయ్య, భక్తుడు, లొద్దపుట్టి

ఫలితం.. నిరాశాజనకం..



ఇంటర్మీడియెట్ ఫలితాల్లో శ్రీకాకుళం విద్యార్థులు నిరాశపరిచారు. శనివారం వెలువడిన ఫలితాల్లో గత ఏడాదితో పోలిస్తే ఉత్తీర్ణతా శాతం మెరుగుపడినప్పటికీ రాష్ట్రస్థాయిలో మాత్రం వెనుబడ్డారు. ఎప్పటిలాగే ఈసారి కూడా బాలురు కంటే బాలికలే పైచేయి సాధించారు.

–శ్రీకాకుళం న్యూకాలనీ

- ఇంటర్మీడియెట్ ఫలితాల్లో అట్టడుగు స్థాయిలో శ్రీకాకుళం
- సీనియర్ ఇంటర్‌లో 74 శాతం ఉత్తీర్ణతతో 23వ స్థానం
- జూనియర్ ఇంటర్‌లో 63 శాతం ఉత్తీర్ణతతో 18వ స్థానం

ఫస్టియర్‌లో 63 శాతం ఉత్తీర్ణత..

ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ప్రథమ సంవత్సరం విద్యార్థులు గత ఏడాదితో కాస్త పోలిస్తే మెరుగనిపించారు. గత ఏడాది 57 శాతం ఉత్తీర్ణత సాధించగా ఈ ఏడాది 63 శాతం ఉత్తీర్ణతను సాధించి జిల్లాల పునర్విభజన(26జిల్లాలు) రాష్ట్రంలో 18వ స్థానంలో నిలిచారు. ప్రథమ సంవత్సరంలో 19,693 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా.. 12,478 మంది ఉత్తీర్ణులయ్యారు.



సెకెండియర్‌లో 74 శాతం..

ఇంటర్మీడియెట్ సెకెండియర్ ఫలితాల్లో 74 శాతం ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రస్థాయిలో 23వ స్థానం సాధించారు. ఒకేషనల్‌లో మాత్రం ముందు వరుసలో నిలిచారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 17,942 మంది పరీక్ష రాయగా 13,309 మంది పాసయ్యారు.

అంబేడ్కర్ గురుకులాల్లో..

శ్రీకాకుళం పాతబస్టాండ్: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులాల్లో ఇంటర్ సెకెండియర్‌లో 90శాతం, ఫస్టియర్‌లో 79 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. సెకెండియర్‌లో 522 మందికి గాను 469 మంది పాసవ్వడంతో 90 శాతం ఫలితాలు వచ్చాయి. ఎంపీసీలో జె.వినయ్‌కుమార్ 969 మార్కులు (దుప్పలవలస), బైపీసీలో పి.శ్రావణి 979 మార్కులు (పాతపట్నం) సాధించారు. ఫస్టియర్‌లో 598 మందికి గాను 470 మంది పాసవ్వడంతో 79 శాతం ఫలితాలు సాధించారు. ఎంపీసీలో కె.జగదీష్(కొల్లివలస) 460 మార్కులు, బైపీసీలో జపె విజయ్ 430 మార్కులు (దుప్పలవలస) సాధించారు. వీరిని గురుకులాల జిల్లా కో ఆర్డినేటర్ ఎస్.బాలాజీ నాయక్ అభినందించారు.

సత్తాచాటిన బీసీ హాస్టల్స్ విద్యార్థినులు



జ్యోతి
(ఎంఎల్‌టీ 984)



రత్నాల మోహిని
(బైపీసీ 957)

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ బీసీ బాలికల కళాశాలల వసతి గృహాల్లో చదివిన విద్యార్థులు సత్తాచాటారని ఏబీసీడబ్ల్యూఓ జి.చంద్రమౌళి తెలిపారు. ఫస్టియర్‌లో 325 మందికి గాను 240మంది, సెకెండియర్‌లో 257 మందికి గాను 215 మంది ఉత్తీర్ణత సాధించారని చెప్పారు.అందులో 900 మార్కులకి పైగా సాధించినవారు 45 మంది ఉన్నారని పేర్కొన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ బీసీ బాలికల కళాశాల వసతిగృహం-4లో ఇంటర్ సెకెండియర్ ఎంఎల్‌టీ గ్రూప్ విద్యార్థిని చెన్నంశెట్టి జ్యోతికి 984 మార్కులు, బైపీసీలో రత్నాల మోహిని 957 మార్కులు సాధించారు. ఇంటర్ సెకెండియర్‌లో 72 మందికి గాను 13 మంది 900పైగా మార్కులు, ఫస్టియర్‌లో 62 మంది హాజరవ్వగా 14మంది 450పైగా మార్కులు సాధించారు. విద్యార్థుల విజయం పట్ల జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి అనురాధ, ఏబీసీడబ్ల్యూఓ చంద్రమౌళి, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ జి.లలిత ఆనందం వ్యక్తం చేశారు.

టాపర్లు వీరే..

సెకెండియర్‌లో..



హేమాంజలి
(ఎంపీసీ 990)



లక్ష్మిలిఖిత
(బైపీసీ 988)



జాక భవ్య
(బైపీసీ 988)

ఎంపీసీ గ్రూపులో శ్రీకాకుళంలోని ఓ కళాశాల విద్యార్థిని హేమాంజలి (బలగ) 990 మార్కులతో సత్తాచాటింది. గురుగుబెల్లి నిఖిలసాయి 987 మార్కులు, కొత్తకోట యసిశ్విని, ఎంవీఎస్ఎస్ సాన్విత, పిల్లా జోష్న, డి.చాతుర్య లాస్య 987 మార్కులతో మెరిశారు. ఎంపీసీ గ్రూపు నుంచి ఓ కళాశాలకు చెందిన వి.లీలా కుమారి 984, జి.కృష్ణ మనోహర్ 983 మార్కులు సాధించారు.బైపీసీలో ఓ కాలేజ్‌కు చెందిన ములంపక లక్ష్మిలిఖిత (రణస్థలం), జాక భవ్య (శ్రీకాకుళం టౌన్) 988 మార్కులతో టాపర్లుగా నిలిచారు. అన్ను సహాయ (శాంతినగర్‌కాలనీ) 987 మార్కులు, మరో కాలేజ్‌కు చెందిన పిసిని లిఖిత 986 మార్కులు, వి.వెన్నెలకుమారి 985 మార్కులు, ఎం.హర్షిత 980 మార్కులతో సత్తాచాటారు.

ఫస్టియర్‌లో..



ధరహాసిని
(ఎంపీసీ 466)



చరణశ్రీ
(ఎంపీసీ 466)



ధూషిత
(బైపీసీ 434)



భాగ్యశ్రీ
(బైపీసీ 434)



బర్రి తులసివేణి
(బైపీసీ 434)



కానూరి దర్శిత్
(బైపీసీ 434)

ఎంపీసీ గ్రూపులో శ్రీకాకుళానికి చెందిన నాతల ధరహాసిని (అరసవల్లి), పొట్నూరు చరణశ్రీ (నరసన్నపేట) 466 మార్కులు సాధించారు. శ్రీకాకుళం ఓ కళాశాలలో చదువుతున్న వీరిద్దరూ జిల్లా టాపర్స్‌తో పాటు స్టేట్‌టాపర్స్ జాబితాలోనూ నిలిచారు. అప్పరాజు యశశ్వి, బండి విజయశ్రీ, ధర్మపురి గోవర్ధన్, నక్క మధుహాసిని, పొట్నూరు లాస్య, పుక్కల్ల రమ్య, ఎస్.రోషన్‌రామ్, యర్నాగుల అక్షయ 465 మార్కులు, పి.యోగితారాణి, పీజీఎస్ సాత్విక, ఎం.లాస్య, కె.మధులత, కె.నందిని , బి.ధర్మారావు 464 మార్కులతో మెరిశారు.బైపీసీలో శ్రీకాకుళం నగరానికి చెందిన పుట్టంసెట్టి ధూషిత, పొట్నూరు భాగ్యశ్రీ, బర్రి తులసివేణి, కానూరి దర్శిత్ 434 మార్కులతో టాపర్లగా నిలిచారు. పప్పల లహరి 433 మార్కులు, పైడి ఐశ్వర్య, పి.దివ్యజీవన 430 మార్కులతో సత్తాచాటారు.

వెనుకబడిన సర్కారీ కళాశాలలు..



గత ఏడాది వరకు మెరుగైన ఉత్తీర్ణత సాధిస్తూ వచ్చిన ప్రభుత్వ యాజమాన్య జూనియర్ కళాశాలలు తాజా ఫలితాల్లో వెనుకబడ్డాయి. సీనియర్ ఇంటర్‌లో 3879 మంది పరీక్ష రాయగా.. 65 శాతం సగటుతో 2521 మంది పాసయ్యారు. జూనియర్ ఇంటర్ ఫలితాల్లో 4566 మంది పరీక్షలు రాయగా 53 శాతం సగటుతో 2399 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రభుత్వం హడావుడి నిర్ణయాలు, దిగువస్థాయిలో అధికారులతో సమీక్షలు లేకుండా తీసుకొచ్చిన ఏకపక్ష విధానాలే దీనికి కారణామని విశ్లేష కులు అభిప్రాయపడుతున్నారు. ఒకేషనల్ విభాగంలో ఫస్టియర్‌లో 65 శాతం, సెకెండియర్‌లో 75 శాతం ఉత్తీర్ణత నమోదు చేసి ఫర్వాలేదనిపించాయి.

పేపర్ బాయ్‌కు 981 మార్కులు



కంచిలి: కంచిలి పట్టణంలో నిరుపేద కుటుంబానికి చెందిన ఇరోతు సాయిగణేష్ ఎంపీసీ విభాగంలో 981 మార్కులు సాధించి శెభాష్ అనిపించాడు. మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో పేపర్ బాయ్‌గా పనిచేస్తూ చదువులో రాణించడంతో అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

-సాయిగణేష్ (981 ఎంపీసీ)

శాలిహుండం కేజీబీవీలో శతశాతం ఉత్తీర్ణత



గార: మండల పరిధిలోని శాలిహుండం కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో శతశాతం ఫలితాలు నమోదయ్యాయి. ఫస్టియర్ బైపీసీలో 37 మందికి గానూ అందరూ ఉత్తీర్ణులవ్వగా ఎస్.మౌనిక 431 మార్కులు సాధించింది. సెకెండియర్‌లో 35 మంది ఉత్తీర్ణులవ్వగా బి.షాలిని 953 మార్కులు సాధించింది.

- బి.షాలిని(బైపీసీ 953)

బాధను అధిగమించి..



మందస: మందసకు చెందిన శివానీ పండా అద్భుత ఫలితం సాధించింది. ఓవైపు పేదరికం, మరోవైపు తండ్రి మరణం అయినా వెనకడుగు వేయకుండా హరిపురంలోని ఓ కళాశాలలో పట్టుదలతో చదివింది. ఇంటర్ సీఈసీ గ్రూపులో 483 మార్కులు సాధించి శభాష్ అనిపించుకుంది.

- శివానీ పండా(సీఈసీ 483)

దివ్యంగా రాణించిన వంశీ..



కాశీబుగ్గ: పలాస పట్టణానికి చెందిన సకలాభక్తుల వంశీ చిన్నతనంలోనే పోలియో సోకడంతో కాళ్లు, చేతులు చచ్చుబడిపోయాయి. కుటుంబ సభ్యుల సహకారం లేకుండా బయటకు రాలేని పరిస్థితి. అయినా ఓ జూనియర్ కళాశాలలో అకుంఠిత దీక్షతో చదివి ఇంటర్ ఫస్టియర్‌లో ఎంపీసీలో 454 మార్కులు సాధించాడు.

- సకలాభక్తుల వంశీ (ఎంపీసీ454)

కేజీబీవీల్లో ఉత్తమ ఫలితాలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో 25 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో 91 శాతం మంది సీనియర్ ఇంటర్ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని సమగ్రశిక్షా ఏపీసీ డాక్టర్ సంపతిరావు శశిభూషణ్ తెలిపారు. 652 మందికిగాను 592 ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. ఫస్టియర్‌లో 817 మందికిగాను 670 మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. గార, జి.సిగడాం, కొత్తూరు, మందస, నందిగాం, సారవకోట, సంతబొమ్మాళి, సోంపేట కేజీబీవీల్లో శతశాతం ఉత్తీర్ణత నమోదైనట్టు ఏపీసీ డాక్టర్ శశిభూషణ్ వెల్లడించారు.

పాఠశాలలో పాము



నరసన్నపేట మండలం సత్యవరం ఉన్నత పాఠశాల్లో శనివారం నాగుపాము కలకలం సృష్టించింది. ప్రాథమిక పాఠశాల వైపు నుంచి ఉన్నత పాఠశాల వైపు పాము రావడంతో విద్యార్థులు గమనించి ఉపాధ్యాయులకు సమాచారమిచ్చారు. పాము బుసలు కొట్టడంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. ఉపాధ్యాయులు స్థానికుల సహకారంతో పామును అట్ట పెట్టెలో బంధించి పొలాల్లో విడిచిపెట్టడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. – నరసన్నపేట

నిందితులకు శిక్షలు పడేలా చూడాలి

- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి





పాల్గొన్న కోర్టు లైజనింగ్ అధికారులు మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్: విధుల్లో ఉండే ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్ నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో కోర్టు కేసుల విచారణ, విధానం, వివిధ దశల్లో ఎదురవుతున్న సమస్యలు, సమన్లు, వారెంట్ల అమలు, సాక్ష్యులను కోర్టులో హాజరుపర్చడం, కేసు అభియోగపత్రాల దాఖలు తదితర విధానాలపై కోర్టు లైజనింగ్ అధికారులతో సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ప్రాసిక్యూషన్‌కు సంబంధించి సమాచారం ఎప్పటికప్పుడు ఎస్ఐ, సీఐలకు అందించాలని, కేసుల వివరాలను కోర్టు క్యాలెండర్‌లో పొందుపర్చాలని, ట్రయల్స్ సమయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సలహాలు, సూచనలు స్వీకరించాలన్నారు. పెండింగ్ ట్రయల్ కేసులు, వారెంట్లు, సమన్లు, సీసీటీఎన్ఎస్ అప్లికేషన్, సీఎంఎస్ (కోర్టు మానిటరింగ్ సిస్టమ్)లో డేటా ఎంటర్ చేయాలన్నారు.

దీంతో ప్రతిరోజూ కోర్టులో ప్రక్రియ ఎలా ఉంటుందనేది ఆన్‌లైన్‌లో వెంటనే అధికారులకు తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో కోర్టు మానిటరింగ్ సిస్టం ఎస్ఐ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీలకు రూ.18.74 కోట్ల రుణాలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ యాక్షన్ ప్లాన్ 2025-26 కింద జిల్లాలోని షెడ్యూల్డ్ కులాల(ఎస్సీ) నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాల కల్పించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. దీనిలో భాగంగా జిల్లాలో 450 మంది లబ్ధిదారులకు రూ.18.74 కోట్ల రుణాలను మంజూరు చేయనున్నట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకుల ద్వారా రూ.1040.55 లక్షల రుణం, ప్రభుత్వ సబ్సిడీగా రూ.740.56 లక్షలు, లబ్ధిదారుల వాటాగా రూ.93.74 లక్షలు ఉంటాయని కలెక్టర్ వివరించారు. ట్రాన్స్‌పోర్ట్ రంగంలో 137 మందికి, పారిశ్రామిక, సేవా, వ్యాపార రంగాల్లో 309 మందికి, వ్యవసాయ రంగంలో నలుగురికి రుణాలు మంజూరు చేయడం ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్టు చెప్పారు.

అర్హతలు ఇవే..

21 నుంచి 50 ఏళ్ల వయసు కలిగి జిల్లాకు చెందిన వారై ఉండాలి. కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు తప్పనిసరి. ట్రాన్స్‌పోర్టు రంగానికి దరఖాస్తు చేస్తే డ్రైవింగ్ లైసెన్స్, బ్యాడ్జ్ ఉండాలి. ఒక రేషన్ కార్డుపై ఒకరికి మాత్రమే లబ్ధి. గతంలో రుణం తీసుకుని తిరిగి చెల్లించని వారు అనర్హులు. అర్హులైన అభ్యర్థులు ఏప్రిల్ 14 నుంచి మే 10 వరకు గ్రామ/వార్డు సచివాలయాల్లో గానీ, ఇంటర్నెట్ సెంటర్ల ద్వారా గానీ దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ దరఖాస్తు కోసం https://apobmms.apcfss.in వెబ్‌సైట్‌ను సందర్శించాలి.

వైభవంగా పుష్పయాగం



అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి కల్యాణోత్సవాల ముగింపులో భాగంగా శనివారం రాత్రి అనివెట్టి మండపంలో పుష్పయాగం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో వై.భద్రాజీ, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ద్వాదశాదిత్యులుగా 12 రకాల పుష్పాలను స్వామి వద్ద అమర్చగా, ఆ పుష్పకాంతుల వెలుగుల్లో ఆదిత్యుని ఉత్సవ కల్యాణ మూర్తులు దివ్యతేజంగా దర్శనమిచ్చారు. అనంతరం ఏకాంతసేవతో కల్యాణ మహోత్సవాలను ముగించారు.

క్లుప్తంగా

అదుపుతప్పి గుడ్లలారీ బోల్తా



బోల్తాపడిన లారీ

నరసన్నపేట: మండలంలోని జాతీయ రహదారిపై మడపాం వద్ద గుడ్ల లారీ అదుపుతప్పి సర్వీసు రోడ్డులో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ సిబ్బంది స్వల్ప గాయాలతో బయటపడగా, లారీ చాలా వరకు నుజ్జు అయింది. దీంతో గుడ్లకు నష్టం వాటిల్లింది. విజయవాడ నుంచి కోల్‌కతాకు గుడ్లుతో వెళ్లున్న లారీ శనివారం వేకువజామున మెయిన్ రోడ్డు నుంచి అదుపు తప్పి సర్వీసు రోడ్డులో బోల్తా పడింది. ప్రమాదానికి డ్రైవర్ నిద్రమత్తే కారణమని తెలుస్తోంది. అయితే రాత్రి సమయం కావడంతో స్థానికులకు ఎటువంటి ఇబ్బంది కలగలేదు.

గంజాయితో వ్యక్తి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ చిన్నంనాయుడు

ఇచ్ఛాపురం: పట్టణ పరిధిలో 16.330 కేజీల గంజాయితో ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ మీసాల చిన్నంనాయుడు తెలియజేశారు. స్థానిక పోలీసు సీఐ కార్యాలయంలో శనివారం పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ పోలీసులకు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో తనిఖీలు నిర్వహించామన్నారు. ఆ సమయంలో ఒడిశాలోని గజపతి జిల్లా మోహన బ్లాక్ అలిగెండా గ్రామానికి చెందిన బినసెంత బాన్‌సింగ్ అనే వ్యక్తి బ్యాగులో 16.330 కేజీల గంజాయిని తరలిస్తుండగా పట్టుబడ్డాడు. నిందితుడిని విచారించగా అలిగెండా గ్రామానికి చెందిన టోప్పో అనే వ్యక్తి సూచనల మేరకు హైదరాబాద్ తీసుకెళ్లి ఒక వ్యక్తికి అందజేయడానికి తరలిస్తున్నట్లు పేర్కొన్నాడు. నిందితుడి వద్ద నుంచి గంజాయితో పాటు ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి అక్రమ రవాణా జరగకుండా చాకచక్యంగా వ్యవహరించిన ఇచ్ఛాపురం పోలీసులను ఎస్పీ అభినందించారన్నారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ ముకుందరావు, క్రైం సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లకు చెందిన పొన్నాడ గంగారావు శుక్రవారం ఎచ్చెర్ల పాత జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. రోడ్డు దాటుతుండగా శ్రీకాకుళం వైపు బైక్‌పై వెళ్తున్న వ్యక్తి ఢీకొన్నాడు. దీంతో 108 అంబులెన్స్‌లో శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రి వైద్య నివేదిక, క్షతగాత్రుని భార్య అన్నపూర్ణ ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేశారు.

కింగ్ కోబ్రా హల్‌చల్



కింగ్ కోబ్రాను పట్టుకున్న నర్సింగ్ మహాపాత్రో

సోంపేట: మండలంలోని కొర్లాం అయ్యప్ప దాబా వద్ద భారీ కింగ్ కోబ్రా శనివారం హల్‌చల్ చేసింది. దీంతో స్థానికులు, దాబా సిబ్బంది భయభ్రాంతులకు గురయ్యారు. అయ్యప్ప దాబా యాజమాన్య సిబ్బంది పాములు పట్టే నర్సింగ్ మహాపాత్రోకు సమాచారం అందజేశారు. మహాపాత్రో పాము ఉన్న స్థలానికి చేరుకుని చాకచక్యంగా పట్టుకున్నాడు. అనంతరం అటవీశాఖ అధికారి జోగారావు సమక్షంలో జలంత్రకోట రిజర్వ్ ఫారెస్టులో విడిచిపెట్టారు.

రైలు నుంచి జారిపడిన మహిళ



గాయపడిన విశ్వాస పాయల్


కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్ కూతవేటు దూరంలో శుక్రవారం రాత్రి 11.30 గంటలకు రైలు నుంచి ఒక మహిళ జారిపడిన ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని కలకత్తా నుంచి తమిళనాడు రాష్ట్రం చెన్నై వెళ్తుండగా సూపర్‌ఫాస్ట్ రైలు నుంచి జారిపడింది. విశ్వాస్ పాయల్ అనే మహిళగా గుర్తించిన పలాస 108 సిబ్బంది ప్రథమ చికిత్స అందించారు. అనంతరం పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో పలాస వైద్యులు శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు.

పాడి పరవళ్లు..!



- స్వచ్ఛమైన పాలకు చిరునామాగా కొత్త కొత్తూరు
- గ్రామంలో 90 శాతం ఇళ్ల వద్ద పాడి సంపద

గేదెలకు పాలు పిండుతున్న పాడిరైతు



కొత్త కొత్తూరు గ్రామం

కొత్తూరు: మండలంలోని కొత్త కొత్తూరు గ్రామం (కూర్మదాసుపురం) స్వచ్ఛమైన పాలకు చిరునామాగా నిలుస్తోంది. ఒకప్పుడు ఈ గ్రామంలోని కుటుంబాలు వ్యవసాయం, వ్యవసాయ కూలీలుగా పనిచేస్తూ జీవనం సాగించేవారు. అయితే వ్యవసాయం లాభసాటిగా లేకపోవడంతో పాడి వైపు వారి ఆలోచన మళ్లింది. దీంతో ప్రస్తుతం ఆ గ్రామంలో 90 శాతం ఇళ్ల వద్ద ఆవులు, గేదెలు పెంచుతూ, పాల విక్రయాలు చేపడుతూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. 55 ఇళ్లు ఉన్న ఈ గ్రామంలో సుమారు 50 ఇళ్ల వద్ద ఆవులు, గేదెలను పెంచుతున్నారు. రోజుకు ఈ గ్రామంలో సుమారు 200 లీటర్ల పాలు ఉత్పత్తి అవుతుంటాయి. ఈ పాలను వారే స్వయంగా కొత్తూరులోని పలు కుటుంబాలకు, టీ షాపులు, స్వీట్ షాపులు, హోటల్స్‌కు లీటర్ రూ.50లకు విక్రయిస్తున్నారు. ఈవిధంగా వచ్చిన ఆదాయంతో సాఫీగా జీవనం సాగిస్తున్నారు. పాడి పోషణ వలన తమకు ఆదాయంతో పాటు ఆరోగ్యం కూడా లభిస్తుందని అక్కడి ప్రజలు చెబుతున్నారు. నిత్యం కుటుంబ సభ్యులంతా పాలను తీసుకోవడంతో పాటు పశువులను మేతకు తీసుకొని వెళ్లడం వలన ఆరోగ్యకరంగా జీవిస్తున్నామన్నారు. అలాగే గ్రామానికి అనుకొని పశువైద్య ఏరియా ఆస్పత్రి ఉన్నందున ఆవులు, గేదెలు అనారోగ్యం బారినపడితే అక్కడికే తీసుకెళ్లి వైద్యం అందిస్తున్నామని చెబుతున్నారు.

ఆరోగ్యంగా ఉంటున్నాం



పాల విక్రయాలు వలన ఆదాయం పెరగడంతో పాటు కుటుంబ సభ్యులంతా పాలు తాగుతుండడంతో శారీరకంగా ఆరోగ్యంగా ఉన్నాము. వ్యవసాయం వలన వచ్చే ఆదాయం కంటే ఆవులు, గేదెల పెంపక వలన వచ్చే ఆదాయం బాగుంది. అయితే ప్రభుత్వం సబ్సిడీపై పశువుల కొనుగోలుకు రుణాలు అందించి ఆదుకోవాలి.

– లోతుగెడ్డ చలపతిరావు, పాడి రైతు, కొత్త కొత్తూరు

సంరక్షణతోనే పాల దిగుబడి



మా దగ్గర ఆవులు, గేదెల సంరక్షణతోనే పాల దిగుబడి బాగుంటుంది. పశువులను కంటికి రెప్పలా చూసుకుంటాము. ప్రధానంగా పచ్చగడ్డి, మంచి పోషక విలువలు ఉన్న దాణా పెట్టడం జరుగుతుంది. ప్రతిరోజూ మేత కోసం పొలాల్లోకి తీసుకెళ్లడం వలన పాల దిగుబడి ఎక్కువగా ఉండడంతో పాటు ఆదాయం బాగుంది. పశువులకు వైద్యం బాగా అందుతోంది.

– లోతుగెడ్డ శశి కుమార్, పాడి రైతు, కొత్త కొత్తూరు

లాభదాయకం



వ్యవసాయం చేస్తే వచ్చే ఆదాయం కంటే పాడి పెంపకం ద్వారా వచ్చే ఆదాయం లాభదాయకంగా ఉంది. రెండు ఆవులను సక్రమంగా సంరక్షించుకొని పెంచినట్లయితే ఒక కుటుంబం సాఫీగా జీవనం సాగించగలదు. రోజంతా ఆవుల సంరక్షణపై జాగ్రత్తలు తీసుకుంటాము. అందువలన మేము పెంచిన ఆవులు అధికంగా పాల దిగుబడి ఇస్తాయి.

– చోడవరపు మురళి, పాడి రైతు, కొత్త కొత్తూరు

జీవో నంబర్ 35ను సవరణ చేయాలి



మాట్లాడుతున్న కిలారి నారాయణరావు

- ఏపీ పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు కిలారి

అరసవల్లి: రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖలో ఇటీవల తీసుకొచ్చిన జీవో నంబర్ 35ని తక్షణమే సవరించాలని పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు కిలారి నారాయణరావు కోరారు. జిల్లాకేంద్రంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. పంచాయతీరాజ్ శాఖలో ప్రభుత్వం తీసుకున్న పాలనా సంస్కరణలను తామంతా స్వాగతిస్తున్నామన్నారు. అయితే జీవో నంబర్ 35తో జిల్లా పరిషత్, మండల పరిషత్‌లలో పరిపాలనాధికారులుగా పనిచేస్తున్నవారికి ఎంపీడీవోలుగా పదోన్నతుల కోటాలో తీరని అన్యాయం జరుగుతుందన్నారు. గతంలో ఎంపీడీవోలుగా పదోన్నతుల్లో జెడ్పీ, మండల పరిషత్ ఉద్యోగులకు 34 శాతం, పంచాయతీ విస్తరణాధికారి (ఇవోపీఆర్డీ)లకు 33 శాతం, అలాగే డైరెక్ట్ నియామకాలకు 30 శాతం, ఇతరులకు 3 శాతం చొప్పున కేటాయింపు ఉండేదని గుర్తు చేశారు.

34 శాతం కేటాయింపు దారుణం

ప్రస్తుతం ఎంపీడీవోల పోస్టులకు డైరెక్ట్ నియామకాలను ప్రభుత్వం రద్దుచేసి, పదోన్నతులతో భర్తీ చేస్తామని ప్రకటించింది. దీంతో ఈ లెక్కన జిల్లా పరిషత్, మండల పరిషత్ ఉద్యోగుల క్యాడర్ స్ట్రెంత్ ప్రకారం పదోన్నతుల కోటా 50 శాతం వరకు తమకే కేటాయింపులు ఇవ్వాల్సి ఉందని కిలారి నారాయణరావు అన్నారు. కానీ ప్రభుత్వం మాత్రం 34 శాతం మాత్రమే కేటాయిస్తున్నట్లుగా ప్రస్తావిస్తూ జీవో విడుదల చేయడం దారుణమన్నారు. ఇప్పటికైనా జిల్లా పరిషత్, మండల పరిషత్ క్యాడర్ స్ట్రెంత్‌ను దృష్టిలో పెట్టుకుని తమకు పదోన్నతుల్లో 50 శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తక్షణమే జీవో సవరించాలని విజ్ఞప్తి చేస్తున్నామని, లేదంటే రాష్ట్ర కమిటీ మార్గదర్శకాల ప్రకారం భవిష్యత్ కార్యాచరణకు సిద్ధమవుతామని ప్రకటించారు. సమావేశంలో జిల్లా సంఘ ప్రధాన కార్యదర్శి కింజరాపు నర్సింహమూర్తి, జిల్లా మహిళ ఉద్యోగుల సంఘ అధ్యక్షురాలు పి.జయమ్మ, జెడ్పీ యూనిట్ ప్రతినిధి మాసపు సంతోష్‌కుమార్, రాష్ట్ర సంఘ ప్రతినిధులు కె.మురళీకృష్ణ పట్నాయక్, సీపాన రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా తెప్పోత్సవం



తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పొందూరు: మండల పరిధిలోని లైదాం శ్రీరామధామంలో సీతారాముల మహాయజ్ఞంలో భాగంగా తెప్పోత్సవం కార్యక్రమం శనివారం రాత్రి 7 గంటలకు కన్నుల పండువగా నిర్వహించారు. తొలుత సీతారామ చంద్రప్రభువుల వారికి రథోత్సవం చేపట్టారు. వారిని పల్లకిలో గ్రామంలో ఊరేగించారు. మహిళలు హారతులు పట్టి పూజలు చేశారు. అనంతరం కొలనులో తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు.

చిక్కోలుకు వన్నెతెచ్చిన 'గాయకుడు ఆనంద్'



ఆనంద్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం జిల్లాకు వన్నెతెచ్చిన వ్యక్తి సినీ గాయకుడు జి.ఆనంద్ అని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక బాపూజీ కళామందిర్ ప్రాంగణంలో ఘంటసాల, బాలు, జి.ఆనంద్ (జీబీఏ) స్వరమాధురి వెల్ఫేర్ అండ్ సర్వీస్ సొసైటీ, ఆనంద్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆనంద్ విగ్రహాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విగ్రహాన్ని రూపొందించిన శిల్పి దివిలి హేమచందర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, గొండు స్వాతి, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, డాక్టర్ నిక్కు అప్పన్న, గేదెల వీర్రాజు, వావిలపల్లి జగన్నాథం నాయుడు, డోల జగన్, ఎం.వి.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాశీబుగ్గలో రేషన్ డిపో సీజ్



కాశీబుగ్గలో రేషన్ డిపోను సీజ్ చేస్తున్న అధికారులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు రెల్లివీధిలో రేషన్ డిపోను రెవెన్యూ అధికారులు శనివారం సీజ్ చేశారు. రెల్లివీధి నుంచి నెహ్రూనగర్‌కు నూతనంగా తరలించి రేషన్‌డిపో నడుపుతున్న డీలర్ రామరాజుపై కార్డుదారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పలాస డిప్యూటీ తహసీల్దార్ సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. బియ్యం, పంచదార, కందిపప్పు లాంటి నిత్యావసర వస్తువులను తప్పుడు తూకంతో తక్కువగా అందజేస్తున్నందున 5వ నంబర్ డిపోను సీజ్ చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. కాగా, డిపో డీలర్ మాత్రం తనకు ప్రభుత్వం ఇచ్చే కమీషన్ చాలనందుకే డిపోలో పనిచేసే సిబ్బందికి జీతం ఇవ్వడానికి తూకం తగ్గించి ఇస్తున్నట్లు చెప్పడం గమనార్హం.

అసాంఘిక పనులకు అడ్డాగా..!

- అధ్వానంగా శ్రీముఖలింగం పర్యాటక భవనం
- గదుల్లో మద్యం బాటిళ్లు, పేకముక్కలు
- పట్టించుకోని అధికారులు



శ్రీముఖలింగంలో ఉన్న టూరిజం విశ్రాంతి భవనం



భవనాల్లో మద్యం బాటిళ్లు, పేకముక్కలు

జలుమూరు: అసాంఘిక కార్యకలాపాలకు శ్రీముఖలింగం పర్యాటక భవనం అడ్డాగా మారింది. కొంతమంది వ్యక్తులు పగటిపూట యథేచ్ఛగా మద్యం తాగుతూ, రాత్రిపూట పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే మరోవైపు ఖైనీ, గుట్కాతో పాటు ఇతర నిషేధిత మత్తు పదార్థాలు సైతం వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ భవనాన్ని సుమారు రూ.45.40 లక్షలతో 2009లో అప్పటి కేంద్రమంత్రి కిల్లి కృపారాణి శంకుస్థాపన చేయగా, 2012లో నిర్మాణం పూర్తి చేశారు. ఈ పర్యాటక విశ్రాంతి భవనం పూర్తయ్యి సుమారు దశాబ్దంన్నర గడుస్తున్నా ఇంకా వినియోగంలోకి రాకపోవడంతో ఇలా దుర్వినియోగం అవుతోందని యాత్రికులు ఆరోపిస్తున్నారు.

నిరుపయోగం

ఇక్కడి శైవక్షేత్రానికి దేశ, విదేశాల నుంచి యాత్రికులు, భక్తులు తండోపతండాలుగా వస్తుంటారు. వీరికి విశ్రాంతి గదులు, తలనీలాలు, హోటల్ సదుపాయాలు ఏర్పాటు చేసేందుకు అవసరమైన అన్ని గదులు నిర్మించి, విద్యుత్ సౌకర్యంతో పాటు అధునాతన సౌకర్యాలు కూడా ఏర్పాటు చేశారు. టూరిజం శాఖ ఆధ్వర్యంలో నిర్మాణం జరిగిన శ్రీకూర్మం, అరసవల్లి క్షేత్రాల్లో భవన నిర్మాణాలు వినియోగంలోకి వచ్చాయి. కానీ శ్రీముఖలింగం భవనం మాత్రం అప్పటినుంచి ఇలానే వినియోగంలోకి తీసుకు రాకుండా ఉంచేశారు. టూరిజం, దేవదాయ ధర్మదాయ శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో ఈ భవనం ఏళ్లు గడుస్తున్నా నిరుపయోగంగా మారింది. అలాగే భవనం చుట్టూ అపరిశుభ్ర వాతావరణం, గోడలు, టైల్స్‌కు పిచ్చిమొక్కలు పెరిగి శిథిలావస్థకు చేరుకుందని భక్తులు చెబుతున్నారు. దీనిపై జిల్లా పర్యాటక శాఖ అధికారి టి.నారాయణరావుకు వద్ద ప్రస్తావించగా భవనం నిర్మాణం జరిగి అప్పట్లో దేవదాయ శాఖకు అప్పగించడం జరిగిందన్నారు. ఈవో పి.ప్రభాకరరావుకు వివరణ కోరగా పూర్తిస్థాయి నిర్మాణం జరిగి తాళాలు ఇవ్వలేదని వివరించారు. ఏదిఏమైనా చిన్నచిన్న మరమ్మతులు చేపట్టి ఈ భవనం వినియోగంలోకి తీసుకు రావాలని యాత్రికులు కోరుతున్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

- భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహరావు



మాట్లాడుతున్న నాయకుడు నర్సింహరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వి.నర్సింహరావు కోరారు. శ్రీకాకుళం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి పెండింగ్ క్లెయిమ్స్ పరిష్కరిస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ అమలు చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 10 నెలలైనా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు అమలు చేయడానికి పూనుకోకపోవడం దారుణమన్నారు. కార్మిక వర్గాన్ని నమ్మించి మోసగించడం పాలకులకు పరిపాటిగా మారిందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో మీనమేషాలు లెక్కిస్తోందని, భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారంలో జాప్యం చేస్తోందని విమర్శించారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలనుకుంటున్న లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సంక్షేమ పథకాల అమలు కోసం ఉద్దేశించి వసూలు చేసిన సెస్ నిధులను, కార్మికుల సంక్షేమానికే ఖర్చు చేయాలని సూచించారు. ప్రభుత్వాలు వివిధ సందర్భాల్లో అక్రమంగా తీసుకున్న వెల్ఫేర్ బోర్డు నిధులను తక్షణమే తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. అర్హులైన భవన నిర్మాణ కార్మికులకు గృహ నిర్మాణాల వెల్ఫేర్ బోర్డు ద్వారా సబ్సిడీతో కూడిన రుణం ఇప్పించాలన్నారు. కార్మికుల పిల్లలకు స్కాలర్ షిప్ అందించాలని, పనిచేసే ప్రదేశాల్లో కనీస మౌలిక సదుపాయలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. నిర్మాణాల్లో ఉపయోగించే వస్తువులపై (ముడి సరుకులు) జీఎస్టీ తగ్గించాలని విన్నవించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వం తీరుకు నిరసనగా, భవన నిర్మాణ కార్మిక సంఘం, సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈనెల 24వ తేదీన కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్లు తెలియజేశారు. అన్ని మండలాల్లోని నిర్మాణ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహరావు, ఏపీ బిల్డింగ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.హరనాథరావు, గౌరవాధ్యక్షుడు ఎం.ఆదినారాయణమూర్తి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇదేం తీరు..!

- రోడ్డు మీదే రోడ్డు వేసిన వైనం



పాత సీసీ రోడ్డుపై మరలా కొత్త సీసీ రోడ్డు వేసిన దృశ్యం



గత ప్రభుత్వ హయాంలో వేసిన సీసీ రోడ్డు

ఇచ్ఛాపురం రూరల్: అధికారంలో ఉన్నామని టీడీపీ నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సరిగా ఉన్న రోడ్లు మీదనే రోడ్డు వేసి తమ చతురతను చాటుకుంటున్నారు. మండలంలోని అరకభద్ర కుమ్మరివీధిలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన సిమ్మెంట్ రోడ్డు ఉంది. అయితే కాసుల కక్కుర్తితో రోడ్డు వేసి ఐదేళ్లు నిండక ముందే, టీడీపీ నాయకులు పల్లె పండగ పేరుతో మరలా అదేరోడ్డు మీద రోడ్డు వేశారు. ఫలితంగా సుమారు రూ.5 లక్షల తమ జేబుల్లోకి మళ్లించుకున్నారని స్థానికులు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. అధికారులకు సైతం పీసీలు అందుతుండడంతో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు.

ఆఫ్‌షోర్ నిర్వాసితులకు న్యాయం చేస్తాం

- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

పలాస: మండలంలోని రేగులపాడు వద్ద ఆఫ్‌షోర్ నిర్మాణానికి భూములిచ్చినవారి త్యాగాలు వెలకట్టలేనివని, నిర్వాసితులకు అన్నివిధాలుగా తగిన న్యాయం చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆఫ్‌షోర్ పనులను పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ.. పనులు పూర్తయితే సాగునీటితో పాటు పలాస పట్టణ ప్రజలకు తాగునీటి కొరత తీరుతుందన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్ వద్ద మొదటిగా 7 లక్షల క్యూబిక్‌ల మట్టి పని చేయాల్సి ఉందని, పనులకు అందరూ సహకరించాలని కోరారు. డైవర్షన్ రోడ్డు పనులు కూడా చేపడతామన్నారు. ఇంకా నిర్వాసితుల సమస్యలు ఉన్నాయని, ప్యాకేజీలు అందరికీ వచ్చేలా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. నిర్వాసితుల కాలనీలో మౌలిక వసతులు కల్పిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఇరిగేషన్ సీఈ రుద్రమనాయుడు, ఎస్ఈ పి.వి.తిరుపతిరావు, ఈఈ శేఖర్‌బాబు, డీఈవీ సుధాకర్, ఆర్డీవో జి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫలితాలు అదరహో..!



విద్యార్థులతో సూర్యతేజ కళాశాల కరస్పాండెంట్ దానేటి పద్మజ

కాశీబుగ్గ: రాష్ట్రవ్యాప్తంగా శనివారం విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో పలాస–కాశీబుగ్గ జంట పట్టణాల్లోని సూర్యతేజ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ద్వితీయ సంవత్సర ఫలితాల్లో బైపీసీలో 989/1000 మార్కులతో గొట్టాపు ప్రియాంక ప్రథమ స్థానంలో నిలిచింది. ఎంపీసీలో 988/1000 మార్కులతో బేవర శ్రీరాగసుధ ఉత్తమ మార్కులను సాధించింది. హెచ్ఈసీలో 975/1000 మార్కులతో కొనారి లక్ష్మిప్రియ ప్రతిభ కనబర్చింది. అదేవిధంగా ద్వితీయ సంవత్సరంలో 989 నుంచి 980 వరకు 14 మంది, 980 నుంచి 900 మార్కులు పైబడి 48 మంది ప్రభంజనం సృష్టించారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీలో ఇంజరపు కావ్య 463/470, హెచ్‌సీలో 430/440 మార్కులతో గోంటి దివ్య, హెచ్ఈసీలో 477/500 మార్కులతో పిలక మనీష ఉత్తమ ఫలితాలు సాధించారు. మొదటి సంవత్సరంలో 463 నుంచి 400 మార్కులు పైబడి 68 మంది ఉత్తమ ప్రతిభ కనబరిచారు. మొత్తం 92% శాతం ఉత్తీర్ణత శాతంతో దూసుకుపోయారు. ఈ విజయంపై కళాశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ దానేటి పద్మజ కామేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బందికి అభినందనలు తెలియజేశారు.